

కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



బడుల్లో పారాలు.. పాటలు

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## రచయిత ప్రభంజన్ మృతి తీరని లోటు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** సామాజిక విప్లవకారుడు, రచయిత ప్రభంజన్ మృతి రాష్ట్రానికి తీరని లోటని తెయూ వీసీ ప్రొఫెసర్ టి యాదగిరి రావు అన్నారు. గురువారం వర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా మామిడాల ప్రవీణ్ అధ్యక్షతన ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మృతికి సంతాపం తెలిపి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ బలోపేతంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పున్నయ్య మాట్లాడుతూ.. ఉద్యమం కోసం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకున్న వ్యక్తి అని కొనియాడారు. అధ్యాపకులు కనకయ్య, శ్రీనివాస్, చంద్రశేఖర్, వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోహన్ బాబు పాల్గొన్నారు.



వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



జిల్లా కేంద్రంలో మానాల ఇంటివద్ద ఉద్రిక్తత



# బీఆర్ఎస్ x కాంగ్రెస్

అధికార, ప్రతిపక్ష పార్టీల సవాళ్లు, ప్రతిసవాళ్లతో వేల్పూర్‌లో గురువారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోటాపోటీ ఆందోళన కార్యక్రమాలతో రోజంతా తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. పథకాల అమలుపై మొదలైన వివాదం చినికి చినికి గాలివానగా మారింది. సవాళ్లు, ప్రతి సవాళ్లు, పోటాపోటీ కార్యక్రమాలతో వేల్పూర్ రాజకీయం వేడెక్కింది. పథకాలు కావడం లేదని బీఆర్ఎస్ నాయకులు నిరూపించేందుకు సిద్ధం కాగా, పక్కాగా అమలవుతున్నాయని చెప్పేందుకు కాంగ్రెస్ నేతలు కనువిప్పు కార్యక్రమం నిర్వహించడానికి యత్నించడం ఉద్రిక్తతకు దారి తీసింది. కొందరు కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అయితే, పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు రెండు వైపులా నేతలను అరెస్టు చేశారు. పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించకుండా అడ్డుకున్నారు. - అక్షరటుడే, నిజామాబాద్

- సవాళ్లు ప్రతిసవాళ్లతో వేల్పూర్‌లో ఉద్రిక్తత
- పోటాపోటీ ఆందోళనలతో రోజంతా ఉత్కంఠ
- పథకాలు అమలు కావట్లేదని బీఆర్ఎస్ నేతల నిరసన
- పోటీగా కార్యక్రమం నిర్వహించిన అధికార కాంగ్రెస్
- ఎమ్మెల్యే ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన కాంగ్రెస్ నేతలు
- రెండు పార్టీల నాయకుల అరెస్టు
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన ఘటనలు

### రోజంతా ఉద్రిక్తత..

బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ కార్యక్రమాలు తలపెట్టడంతో గురువారం రోజంతా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయి దాటకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇంటి వద్ద భారీగా బలగాలను మోహరించారు. వేముల నివాసం వద్ద బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. మరోవైపు, పోటీగా కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతంగా మారింది. పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈ నేపథ్యంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసంలోకి దూసుకెళ్లారు. వారితో పాటు అక్కడున్న ఇరు పార్టీల నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య కొంతకాలంగా వాగ్వాదం జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అర్హులైన వారికి కాకుండా తమ వారికే పథకాలు వర్తింపజేసి, మిగతా వారికి ఇవ్వడం లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అర్హులందరికీ న్యాయం చేశామని, కానీ కాంగ్రెస్ నేతలు మాత్రం తమ వారికే ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ నేతలు అసలైన లబ్ధిదారులకే పథకాలు వస్తున్నాయని తెలిపారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు.

### సవాళ్లు.. ప్రతి సవాళ్లు..

బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ పోరు కొనసాగుతోంది. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి, కాంగ్రెస్ నేతలు సునీల్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కింది స్థాయి కేడర్ కూడా అదే రీతిలో సై అంటే సై అన్నట్లు వ్యవహరిస్తోంది. నియోజకవర్గంలో పథకాల అమలు, ఇసుక మొరం అక్రమాలు, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు వంటి వాటిపై రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరువైపులా నాయకులు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. విమర్శలు కాస్త సవాళ్లకు దారి తీశాయి. పథకాలు అమలు కావడం లేదని తాము నిరూపిస్తామని గులాబీ నేతలు సవాల్ విసరగా, సంక్షేమ పథకాలు పక్కాగా కొనసాగుతున్నాయని, లబ్ధిదారులను తీసుకొని వస్తామని గురువారం వేల్పూర్‌లో 'కనువిప్పు' పేరిట చర్చ పెడదామని కాంగ్రెస్ నాయకులు ప్రతి సవాల్ విసిరారు. దీనికి సై అన్న బీఆర్ఎస్ నేతలు తాము కూడా పథకాలు అందని అర్హులని తీసుకొస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో నే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.




### మానాల మోహన్‌రెడ్డి హౌస్ అరెస్ట్



వేల్పూర్‌లో కాంగ్రెస్ నేతలు కనువిప్పు కార్యక్రమానికి బయలుదేరేందుకు సిద్ధమైన డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఉదయం పోలీసులు ఆయన ఇంటికి చేరుకుని బయటకు వెళ్లకుండా నిర్బంధించారు. కాగా.. తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మాటలు రోజురోజుకూ మితిమీరుతున్నాయని, దమ్ముంటే బీఆర్ఎస్ పదేళ్ల అభివృద్ధిపై చర్చించాలని విసిరారు. బీఆర్ఎస్ పదేళ్లలో అభివృద్ధిని తాము 18 నెలల్లోనే చేసి చూపించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో రైతులకు బోనస్ ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. కేరళ మినహా ఎన్ఆర్ఐ సెల్‌ను ఏర్పాటు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. అలాగే గల్ఫ్ బాధితులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించామని, వేల్పూరులోనూ 18 మందికి అందించామని చెప్పారు.

## మానాలా.. నీ కడుపు సల్లబడిందా..?




**అక్షరటుడే, ఆర్మూర్:** తన ఇంటిపైకి కాంగ్రెస్ నాయకులను దాడికి పంపి రణరంగం చేయించిన మానాల మోహన్ రెడ్డి.. నీ కడుపు సల్లబడిందా..? అని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. వేల్పూర్‌లోని తన ఇంటి నుంచి గురువారం వీడియో సందేశం విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. ఎన్ఆర్ఐ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశానన్నారు. అలాగే గల్ఫ్ కార్మికుల టోల్ ఫ్రీ ఏర్పాటు చేయాలని.. గల్ఫ్ మృతులకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని తాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశానని స్పష్టం చేశారు. తాను అడిగిన న్యాయమైన డిమాండ్లను పక్కనపెట్టి వరంగల్ నుంచి కాంగ్రెస్ నాయకుడు నంగి దేవేందర్‌రెడ్డిని పిలిపించి నా ఇంటిపైకి ఉసిగొల్పారని ఎమ్మెల్యే ఆరోపించారు.. నా ఇంట్లోకి చొరబడి నా సోదరుడిపై దాడి చేయడమే కాకుండా ఇంట్లోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి హంగామా సృష్టించారన్నారు.

## రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించారు. రోగులతో మాట్లాడారు.. అనంతరం మాతా శిశు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అందుబాటులో ఉండాలని, ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్ల ఆగడాలు ఎక్కువయ్యాయని వివరించారు. రక్త పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపించాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు వివరించారు. రోగులకు భోజనం అందించే ఏజెన్సీ నిర్వాహకుడిపై పోచారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. శానిటేషన్ నిర్వహణ సరిగా లేదని సూపర్‌వైజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, నాయకులు కృష్ణారెడ్డి, ఎజాజ్, శివ దయాల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపులు, మీసేవ కేంద్రాలను తనిఖీ చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** రేషన్ షాపులు.. మీసేవ కేంద్రం క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో లోటుపాట్లకు తావు లేకుండా ఉండేందుకు క్షేత్రస్థాయిలో చౌక ధరల దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తుదారుల నుంచి నిర్ణీత రుసుము మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అధిక డబ్బులు వసూలు చేసే కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను తొందరగా పరిష్కరించాలని కలెక్టర్ తహశీల్దార్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, హౌసింగ్ శాఖ అధికారి నివర్తి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## 21న పోస్టల్ సేవలు బంద్..

**అక్షరటుడే,ఇందూరు:** ఉమ్మడి జిల్లాలోని తపాలాశాఖలో రానున్న రోజుల్లో కొత్త సాఫ్ట్‌వేర్ అమల్లోకి రానుంది. దీనికి సంబంధించి గురువారం పోస్టల్ ఉద్యోగులకు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ జనార్ధన్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 22న పోస్టాఫీస్‌లలో కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అవుతున్నందున ఈనెల 21న పోస్టాఫీస్‌లలో సేవలు నిలిపివేయనున్నట్లు తెలిపారు.



బోనాలు ఎత్తుకున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య, అలుక కిషన్



పోతరాజుల విన్యాసాలు

# టీజీవోస్ ఆధ్వర్యంలో బోనాల సంబురం

తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులు బోనాలతో పాత కలెక్టరేట్ వద్ద ఉన్న ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి సారే సమర్పించారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, సంఘం అధ్యక్షుడు అలుక కిషన్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఉద్యోగుల బోనాల ఉత్సవాల్లో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సాంప్రదాయ ఉట్టిపడేలా బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, భక్తులకు మహా అన్న ప్రసాదం చేపట్టారు.

– అక్షరటుడే, ఇందూరు

## హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు హోంగార్డులు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అందించే ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పతకాలకు ఎంపికయ్యారు. వీరిలో ఇద్దరు హోంగార్డులు తమ ప్రాణాలకు తెగించి మరో ఇద్దరిని కాపాడగా.. నిబద్ధతతో పోలీస్‌శాఖకు సేవచేస్తున్న మరొకరికి పతకాలు దక్కాయి.

### చెరువులో దూకి ప్రాణాలు కాపాడి..

పిట్లం మండలంలో చెరువులో దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేయగా బ్లూకోర్టు హోంగార్డు మారుతి చెరువు మధ్యలోకి వెళ్లి ఆమెను రక్షించాడు. అలాగే కామారెడ్డిలో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను సమయస్ఫూర్తితో హోంగార్డు వసంత్ కాపాడాడు. వీరిరువురికి ఉత్కృష్ట పతకం లభించింది.

### 31 ఏళ్లుగా పోలీసుశాఖలో నిబద్ధతతో..

పోలీసు శాఖలో నిబద్ధతతో 31 ఏళ్లుగా ఉత్తమ సేవలందిస్తూ ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు మల్లికార్జున్ అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ముగ్గురు హోంగార్డులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని హోంగార్డుల సేవలను గుర్తించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పతకాలను ప్రకటించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఇది పోలీస్ శాఖలో సేవా తత్పరతకు ప్రతీకగా నిలుస్తోందని ఎస్పీ తెలిపారు. హోంగార్డు సేవలో ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా ఉత్తమ సేవలు అందిస్తున్న వారితో పాటు, ప్రజల ప్రాణాలను రక్షించిన వారికి పతకాలు అందజేస్తారన్నారు.



మారుతి



వసంత్



మల్లికార్జున్

## మొక్కలతోనే భావితరాలకు భవిష్యత్తు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, భావితరాలకు కాలుష్యం లేని పర్యావరణం అందించాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని లేఅవుట్ స్థలాల్లో మున్సిపాలిటీకి కేటాయించిన 10శాతం స్థలాలను కమిషనర్ రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేఅవుట్లలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటాలని, తద్వారా భావితరాలకు భవిష్యత్తునిచ్చిన వారమవుతామన్నారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం గుండ్ల చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలు, మున్సిపల్ అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన వైష్ణవి




**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైంది. నర్వ మండల్ పరిషత్ అప్పర్‌ప్రైమరీ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని వైష్ణవి గత జూన్‌లో నిర్వహించిన క్రీడాపాఠశాల ఎంపికలో పాల్గొంది. ఈ సందర్భంగా నిజాంసాగర్, మహమ్మద్ మండలాల ఎంఈవోలు అమర్‌సింగ్, తిరుపతిరెడ్డి, యూపీఎస్ నర్వ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు. భవిష్యత్తులో క్రీడల్లో ప్రతిభ చూపి మండలానికి పేరు తేవాలని సూచించారు.

## ఫ్రెండ్స్ ఫర్టిలైజర్ దుకాణం ప్రారంభం



**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో ఫ్రెండ్స్ ఫర్టిలైజర్ దుకాణాన్ని గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులనే అమ్మాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హన్మంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు కొట్టం మనోహర్, గంధపు పవన్, కేశవ వీరేశం, రాజు, దత్తు, ధనరాజ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## దండు శేఖర్‌ను పరామర్శించిన మాజీఎమ్మెల్యే




**అక్షరటుడే, ఇందూరు:** అనారోగ్యం కారణంగా మాజీ మేయర్ దండు నీతూకిరణ్ భర్త దండు శేఖర్ హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా గురువారం పరామర్శించారు. చికిత్స గురించి వివరాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రోడ్లపై కేజ్‌వీల్స్ నడిపితే చర్యలు



**అక్షరటుడే, బిచ్కుంద :** బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆర్టీఏ అధికారులు హెచ్చరించారు. మద్నూర్, బిచ్కుంద మండలాల్లో గురువారం రైతులకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంవీఐ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో రోడ్డు చెడిపోతుందని, తద్వారా వాహనదారులు ప్రమాదాల బారిన పడతారని అన్నారు. మట్టిరోడ్లపై మాత్రమే నడపాలని సూచించారు. అనంతరం రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రోడ్లపై కేజ్‌వీల్స్ నడవకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## బీసీ విద్యార్థులకు షరతుల్లేకుండా రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి



**అక్షరటుడే, ఇందూరు:** బీసీ విద్యార్థులకు పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కోర్సుల్లో షరతుల్లేకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో బీసీ విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు ఎటువంటి షరతులు లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి.. బీసీ విద్యార్థులకు మాత్రం షరతులు విధించడం అన్యాయం అన్నారు. బీసీ విద్యార్థులకు పదివేలలోపు ర్యాంకు వస్తేనే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. అది కూడా కేవలం రూ.35వేలు ఇవ్వడం సరికాదన్నారు. గత మూడేళ్లుగా బకాయిలు పేరుకు పోవడంతో బీసీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బీసీ సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగా కిషన్, రాష్ట్ర యువజన కార్యదర్శి శంకర్, రవీందర్, దేవేందర్ , అజయ్, చంద్రకాంత్, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్యం పుస్తకాలతో కుస్తీ పడే విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇకపై పాఠాలతో పాటు పాటలు నేర్పించేందుకు కసరత్తు చేస్తుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పీఎంశ్రీ పథకంలో భాగంగా స్కూళ్లను ఎంపిక చేసింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ పలు పాఠశాలలు ఎంపికయ్యాయి. - అక్షరటుడే, ఇందూరు

# బడుల్లో పాఠాలు.. పాటలు


ధర్పల్లి ఉన్నత పాఠశాలకు చేరుకున్న సంగీత వాయిద్య పరికరాలు

▸ పీఎం శ్రీ స్కూళ్లలో మ్యూజిక్ క్లాసులు ▸ పాఠశాలలకు చేరిన తబలా, హార్మోనియం, మృదంగం తదితర పరికరాలు

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో భాగంగా సర్కారు బడిలో చదివే విద్యార్థులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా సంపూర్ణ విద్య అందించడం ఈ పథకం లక్ష్యం. అనుభవాత్మక, విచారణ ఆధారిత అభ్యాసాలు, పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాలు కల్పిస్తారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో ఆయా పరికరాల ద్వారా మ్యూజిక్ క్లాసులు చెప్పాలని నిర్ణయించారు. తొలి విడతగా రాష్ట్రంలో 270 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 18 పాఠశాలలు ఉన్నాయి. నిజామాబాద్ లో 9, కామారెడ్డిలో 9 పాఠశాలలు ఎంపికయ్యాయి.

### పాఠశాలలకు చేరుకున్న పరికరాలు..

ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లోనూ మ్యూజిక్ క్లాసులు నిర్వహించనున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు తబలా, హార్మోనియం, మృదంగం, వయోలిన్, తదితర మ్యూజిక్ పరికరాలు చేరుకున్నాయి. ఎంపికైన పాఠశాలలకు పీఎం శ్రీ పథకం కింద రూ.లక్ష చొప్పున అందజేయనున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకు, అలాగే ఆసక్తి ఉన్న ఇంటర్ విద్యార్థులకూ సంగీతం నేర్పించనున్నారు. వారానికి ఓ క్లాస్ మ్యూజిక్ కోసం కేటాయించి శిక్షణను అందజేస్తారు.

### సంగీత టీచర్ల నియామకం..

సంగీత పాఠాలు బోధించేందుకు ఆయా పాఠశాలలకు ఒక్కో సంగీత టీచర్‌ను నియమించుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో టీచర్ కి నెలకు రూ. 10 వేలు ఇవ్వాలని భావిస్తున్నారు. అయితే ఈ టీచర్ల ఎంపిక అధికారులకు కష్టంగా మారిపోయింది. నాలుగు కళలు తెలిసినవారు అరుదుగా ఉంటారు. అయితే వివిధ పరికరాలపై పట్టున్న టీచర్లను ఎంపిక చేసి రొటేషన్ పద్ధతుల్లో క్లాసులు చెప్పించాలని ఆలోచిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు టీచర్ల నియామకం చేపట్టి, వచ్చేనెల మొదటి వారంలో క్లాసులు ప్రారంభించాలని భావిస్తున్నారు. ఈ టీచర్ల ఎంపికకు జిల్లాల్లోని బాల భవన్, బాలబడి సహకారం తీసుకోనున్నట్లు తెలిసింది.

### విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే అవకాశం



పీఎం శ్రీ పథకంలో మా పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. పిల్లలకు పాఠాలతో పాటు మ్యూజిక్ క్లాసులను చెప్పించాలనే నిర్ణయం ఎంతో బాగుంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసే అవకాశం ఉంటుంది. సంగీత వాయిద్య పరికరాలు చేరుకున్నాయి. త్వరలోనే తరగతులు ప్రారంభమవుతాయి.

– విజయ, హెచ్‌ఎం, ధర్పల్లి ఉన్నత పాఠశాల

## కాలుష్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



**అక్షరటుడే, ఇందూరు:** భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. సారంగాపూర్ అర్బన్ పార్క్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు 2018లో దేశ రాజధాని ఢిల్లీలో పది లక్షలకు పైగా నీడనిచ్చే, ఔషధ మొక్కలు నాటడం జరిగిందన్నారు. ప్రధాని మోదీ కూడా అమ్మ పేరు మీద మొక్క నాటాలని పిలుపునివ్వడం జరిగిందని గుర్తు చేశారు. అడవులను కాపాడుకుంటూ.. చెట్లను పెంచినప్పుడు మాత్రమే కాలుష్యాన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోగలుగుతామని ఎమ్మెల్యే తెలిపారు. హిందూ సంస్కృతి ప్రకారం సౌరశక్తిని సూర్యదేవుడిగా.. జలాన్ని గంగాదేవిగా కొలుస్తూ చెట్లను కూడా పూజించే సంస్కృతి ఉందన్నారు. ఔషధ గుణాలు ఉన్న అరటి, రావి, తులసి, మర్రి, మామిడి, వేప వంటి చెట్లు పెరట్లో పెంచుకుని పూజించే వాళ్లమని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో సుధాకర్, ఎఫ్ఆర్‌వోలు సంజయ్, రవి మోహన్, రాధిక, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారమే లక్ష్యంగా ముదిరాజ్‌లు పోరాడాలి



**అక్షర టుడే, ఎల్లారెడ్డి :** రాజ్యాధికారమే లక్ష్యంగా ముదిరాజ్‌లు పోరాడాలని కామారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు డా బట్టు విఠల్ పిలుపునిచ్చారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మండల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జనాభాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్‌లు రాజకీయ, విద్యా, ఉద్యోగపరంగా ముందుండాలన్నారు. నాయకత్వ లక్షణాలను పెంచుకొని ఐకమత్యంతో రాజకీయాల్లో రాణించాలన్నారు.

### మండల, యువజన కమిటీల ఎన్నిక

అనంతరం మండల, యువజన కమిటీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముదిరాజ్ సంఘం ఎల్లారెడ్డి మండల గౌరవాధ్యక్షుడిగా కుడుముల సత్యనారాయణ, అధ్యక్షుడిగా ప్యాలాల రాములు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దుద్దుల సాయిరాం, ఉపాధ్యక్షులుగా నీల సిద్ధిరాములు, జక్కుల అశోక్, బాలయ్య, ఒట్లం భాస్కర్, బోనగిరి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా గోనె శ్రీకాంత్, కార్యదర్శులుగా కాశీరాం, లక్ష్మయ్య, చంద్రబాబు, దత్తు, రవీందర్, కాశిరాం, కోశాధికారిగా సూర్యప్రకాష్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యువజన కమిటీ అధ్యక్షుడిగా కిరణ్ తేజ, ఉపాధ్యక్షులుగా జనముల పోచయ్య, బద్దుల రాములు, నీల రవి, క్యాస రమేష్, ప్రధాన కార్యదర్శిగా కంచుమల్లె మహేందర్, ఉప కార్యదర్శిగా చింతల రమేష్, పెద్దబోయిన విఠల్, అంజయ్య, తలారి సాయిలు, నాగరాజు, లచ్చయ్య ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు ఏగుల నర్సింలు, బోన్ల సాయిలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి బాలకిషన్, సొసైటీ సీఈఓ విశ్వనాథం, డైరెక్టర్ మర్రి సూర్యప్రకాష్, మాజీ సర్పంచులు, ముదిరాజ్ కులస్థులు తదితరులు పాల్గొన్నారు.

## షీటీం కార్యక్రమాలపై అవగాహన



**అక్షరటుడే, బిచ్కుంద :** మహిళలు, యువతులను ఆకతాయిలు వేధిస్తే షీటీం పోలీసులను సంప్రదించాలని ఎస్సై విజయ్ కొండ అన్నారు. గురువారం మద్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. షీటీం నంబర్ 8712686094, సైబర్ నేరాలపై ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నంబర్ 1930, అత్యవసర సమయంలో డయల్ 100 సేవలపై వివరించారు. యువత సామాజిక మాధ్యమాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి, శేషారావు ఉన్నారు.

## నవోదయకు విద్యార్థి ఎంపిక



**అక్షరటుడే, భీమ్‌గల్:** పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి యేన్ను శ్రీమాన్ నవోదయ విద్యాలయ సమితిలో (నిజామాబాద్) 6వ తరగతికి ఎంపికయ్యాడు. విద్యార్థిని పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ జి. బసంత్ రెడ్డి, కమిటీ సభ్యులు, సరస్వతి విద్యాపీఠం ఇందూర్ విభాగ్ సైక్షానిక్ ప్రముఖ్ పక్కి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శ్రీ రాజుల దేవి రవినాథ్, ప్రధానాచార్యులు రాస రవికుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.నర్సారెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి పి. సాయిచరణ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## కారంచేడు అమర వీరులకు నివాళులు




**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో కారంచేడు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ సందర్భంగా వారి సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు కొక్కెర భూమన్న, అంగారీ ప్రదీప్ మూగ ప్రభాకర్, వామపక్ష నేతలు దాసు, భూమయ్య, కొంతం మురళి, రింగుల భూషణ్, కోటేశ్వర్, ఎల్‌టి కుమార్, నారాయణ, రాజన్న పులి గంగాధర్, స్వామి, సాయన్న, న్యాయవాదులు గంట విప్లవ్, తెడ్డు నర్సయ్య, రవి, వికాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్పీని సన్మానించిన బీజేపీ నాయకులు



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డిని గురువారం బీజేపీ నాయకులు సన్మానించారు. డీఎస్పీ కార్యాలయంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నస్రుల్లాబాద్ మండల సీనియర్ నాయకులు అనుసూరి శ్రీనివాస్, పెర్క రాములు, అరిగె నారాయణ, గొడిసెల యాదగిరి గౌడ్, అనిల్ గుప్తా, కంది పెద్ద మల్లేష్, మనూర్ సాయిలు, ఉల్లెంగ గోపి, ఉల్లెంగ పర్వయ్య, కొప్పుల సాయిలు, బ్యాగరి సాయిలు, ఉల్లెంగ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.